సాక్షి
రంగారెడ్డి
గురువారం। 19। జనవరి। 2023

















ఫుల్..గిల్..చిల్

ఉప్పల్‌లో ఉప్పొంగిన అభిమానం.. ఉత్కంఠ పోరులో ఉరిమిన ఉత్సాహం

ఉప్పల్ స్టేడియంలో పరుగుల ఉప్పెన ఎగిసింది. మధ్యాహ్నం ఎండలో.. సాయంత్రం చలిగాలిలో.. రాత్రి చుక్కల ఆకాశంలో.. అభిమానులు ప్రతి పరుగునూ, ప్రతి బంతినీ ఆస్వాదించారు. ముందుగా శుభ్‌మన్ గిల్ పరుగుల వరదకు.. అనంతరం 'లోకల్ బాయ్' సిరాజ్ నిప్పులు చెరిగే బంతులకు.. చివర్లో న్యూజిలాండ్ బ్యాటర్ మైకేల్ బ్రేస్‌వెల్ పోరాట పటిమకు ముగ్ధులయ్యారు. వెరసి.. హైదరాబాద్‌లో భారత్, న్యూజిలాండ్ వన్డే మ్యాచ్ సూపర్ హిట్ అయ్యింది. అభిమానులు వెచ్చించిన ప్రతి పైసాకు ఫుల్ వినోదం లభించింది. ఇప్పటి వరకు భాగ్యనగరంలో న్యూజిలాండ్‌తో జరిగిన అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో భారత్ ఓడిపోలేదు. ఈసారీ అదే ఆనవాయితీని టీమ్ ఇండియా కొనసాగించింది. తన అజేయ రికార్డును నిలబెట్టుకుంది.

– సాక్షి, సిటీబ్యూరో/ఉప్పల్

న్యూస్‌రీల్

తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్ జ్యోతి బదిలీ

కొత్త కమిషనర్‌గా మహ్మద్ సాబేర్ అలీ

తుర్కయంజాల్: మున్సిపల్ కమిషనర్ ఎంఎన్ఆర్ జ్యోతిని బదిలీ చేస్తూ రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ అర్వింద్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. తుర్కయంజాల్‌కు శంషాబాద్ కమిషనర్‌గా పనిచేస్తున్న మహ్మద్ సాబేర్ అలీని కమిషనర్‌గా నియమించారు. జ్యోతిని సీడీఎంఏ కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. 2021 నవంబర్ 1వ తేదీ నుంచి ఆమె ఇక్కడ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. మున్సిపాలిటీలో అన్ని పార్టీల కౌన్సిలర్లను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణాల విభాగంలో స్వచ్ఛ సర్వేక్షణ్ పురస్కారం రావడంలో తనవంతు పాత్ర పోషించారు.

చిలుకూరు సన్నిధిలో యూపీ డిప్యూటీ సీఎం



మొయినాబాద్: చిలుకూరు బాలాజీని బుధవారం ఉత్తరప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి బ్రజేష్ పాఠక్ దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు రంగరాజన్ ఆయనకు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు. వారణాసిలోని జ్ఞానవాసి దేవాలయంలో జరుగుతున్న వివాదానికి, చిలుకూరు బాలాజీ స్వామి వారి పిటిషన్‌కి ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మద్దతు తెలపాలనే సందేశాన్ని అందజేయాలని రంగరాజన్ కోరారు. స్వామివారి ఆజ్ఞగా భావించి తప్పకుండా తెలుపుతా మని బ్రజేష్ పాఠక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలోని శివాలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ చరిత్రను అడిగి తెలుసుకున్నారు.

28న సైన్స్ సెమినార్

ఇబ్రహీంపట్నం రూరల్: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఈ నెల 28న ఉపాధ్యాయ, అధ్యాపకులకు సెమినార్ నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'దేశాన్ని స్వావలంబనగా మార్చడానికి సైన్స్ సంస్కృతిని ప్రోత్సహించడం' అంశంపై సెమినార్ ఉంటుందన్నారు. రైట్ ఆఫ్ స్క్రీనింగ్ తర్వాత ఎంపిక చేసిన అభ్యర్థులు మాత్రమే ప్రదర్శన ఇవ్వడానికి ఆహ్వానించబడతారన్నారు. సైన్స్‌లో పురోగతి.. దాని అవకాశాలను అన్వేషించే పాత్ర, ప్రాచీన భారతీయ శాస్త్ర విజ్ఞానం.. ఆధునిక కాలంలో దాని ఉపశమనం, నైపుణ్యం, అభివృద్ధి, ప్రాథమిక స్థాయిలో ఉత్సుకతను పెంచడానికి బోధనాశాస్త్రంలో కళ, ఆటల ఏకీకరణ, జీవన మార్గంగా మార్చడానికి సైన్స్ అవసరం అనే అంశాలపై మండల విద్యాధికారులకు, ప్రిన్సిపాల్స్‌కి వచ్చే నెల 2న మెయిల్ చేస్తామన్నారు. టీశాట్ ద్వారా ఈ నెల 19న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పేపర్ ఎలా సిద్ధం చేసుకోవాలనేదానిపై టెలికాన్ఫరెన్స్ ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

'కంటి వెలుగు'కు సిద్ధం

నేడు మీర్‌పేట మున్సిపాలిటీ అంబేడ్కర్‌నగర్‌లో షురూ
- ప్రారంభించనున్న మంత్రి సబితారెడ్డి
- ఏర్పాట్లు పూర్తిచేసిన జిల్లా యంత్రాంగం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: రెండో విడత కంటి వెలుగు కార్యక్రమానికి అంతా సిద్ధమైంది. జిల్లాలో 37 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని 558 పంచాయతీలు.. 23 జీహెచ్ఎంసీ వార్డులు.. 358 మున్సిపల్ ప్రాంతాల్లో వంద రోజుల పాటు శిబిరాలు నిర్వహించనున్నారు. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ఇప్పటికే జిల్లా యంత్రాంగం పూర్తి చేసింది. గురువారం ఉదయం 9 గంటలకు మీర్‌పేట మున్సిపల్ పరిధిలోని అంబేడ్కర్‌నగర్‌లో కార్యక్రమాన్ని మంత్రి సబితారెడ్డి ప్రారంభించనున్నారు. ఆ వెంటనే జిల్లా వ్యాప్తంగా 75 కేంద్రాల్లో కంటి పరీక్షలు ప్రారంభమవుతాయి. మరో ఐదు మొబైల్ టీమ్‌లు పనిలో నిమగ్నం కానున్నాయి. మీర్‌పేట్ మెడికల్ క్యాంప్ ప్రారంభోత్సవం తర్వాత మంత్రి సబిత అల్మాస్‌గూడ, పహాడీషరీఫ్, కొల్ల పడ్కల్‌లోని శిబిరాలను సందర్శించనున్నారు. ఈ మేరకు బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, ఇతర అధికారులు ఆయా ప్రాంతాల్లో పర్యటించి ఏర్పాట్లను పర్యవేక్షించారు.



అంబేడ్కర్‌నగర్‌లో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వర్ రావు తదితరులు

పోర్టల్‌లో వివరాల నమోదు

జిల్లా వ్యాప్తంగా 80 కంటి వైద్య బృందాలను ఎంపిక చేశారు. అప్టోమెట్రిస్ట్‌తో పాటు మరో 80 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లను తాత్కాలిక అవుట్ సోర్సింగ్ ప్రతిపాదికన నియమించి వారికి ఇప్పటికే పూర్తిస్థాయి శిక్షణ ఇచ్చారు. ఒక్కో టీమ్‌లో మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో 8 మంది వైద్య సిబ్బంది ఉంటారు. ఒక అప్టో మెట్రిస్ట్, ఒక సూపర్ వైజర్, ఇద్దరు ఏఎన్ఎంలు, ముగ్గురు ఆశాలు, ఒక డీఈవో టీంలో సభ్యులుగా ఉంటారు. రోజువారీగా క్యాంపులు నిర్వహించే ప్రాంతాలు, రోగి పేరు, ఆధార్ నంబర్, చిరునామాను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయనున్నారు. కంప్యూటరైజ్డ్ స్క్రీనింగ్‌లో నిర్ధారించిన దృష్టి లోపం ఎంత శాతం, ఇవ్వాల్సిన కంటి అద్దాలు, బార్‌కోడ్ వివరాలతో పాటు ఉచితంగా అందజేసిన మందులు, కళ్లద్దాల వివరాలు రికార్డు చేయనున్నారు. శని, ఆదివారాలు మినహా మిగతా అన్ని పని దినాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు క్యాంపులు పని చేస్తాయి.

జయప్రదం చేయాలి

నందిగామ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఆరోగ్య సిబ్బంది, వైద్యులు కృషి చేయాలని ప్రోగ్రాం రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సుధీర అన్నారు. మండల కేంద్రంలో గురువారం ప్రారంభం కానున్న కార్యక్రమంపై బుధవారం ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధీర మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేసుకునేలా ఆరోగ్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు వేసిన ముగ్గులను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ జయలక్ష్మి, పీహెచ్‌సీ డాక్టర్ తులసి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సదుపాయాల పరిశీలన

షాద్‌నగర్‌రూరల్: చించోడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సబ్ సెంటర్ ఎలికట్ట, కిషన్ గ్రామాల్లో కంటి వెలుగు ఏర్పాట్లను బుధవారం కార్యక్రమ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సుధీర పరిశీలించారు. రికార్డులను పరిశీలించడంతో పాటు శిబిరాలకు వచ్చే వారికి కల్పిస్తున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



ట్రయల్ రన్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ సుధీర తదితరులు

సద్వినియోగం చేసుకోవాలి

కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. క్యాంపులు ఏర్పాటు చేసే ప్రాంతాల గుర్తింపు, షామియానాలు, బ్యానర్లు, ఫర్నిచర్, సిబ్బంది రాకపోకల కోసం రవాణా సదుపాయం సమకూర్చాం. 18 ఏళ్ల పైబడిన ప్రతి ఒక్కరికీ కంటి పరీక్షలు చేస్తాం. రీడింగ్ గ్లాసులు అవసరమైన వారికి వెంటనే అందజేస్తాం. ప్రిస్కిప్షన్ గ్లాసులను నెలరోజుల్లో అందజేస్తాం. జిల్లాలో సుమారు 12 లక్షల మందికి కంటి పరీక్షలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, డీఎంహెచ్ఓ

స్టోన్ క్రషర్‌కు ఎసరు

- క్రషర్ యజమాని, అటవీ శాఖ మధ్య భూ వివాదం
- నిలిచిపోయిన యూనిట్ కార్యకలాపాలు
- తుక్కు విక్రయదారుడితో కుమ్మక్కైన ఎఫ్ఆర్ఓ
- క్రషింగ్ యంత్రాలు తుక్కు కింద విక్రయం
- కడ్తాల్ ఠాణాలో కేసు నమోదు: ముగ్గురి అరెస్టు
- పరారీలో ఆమనగల్లు ఇన్‌చార్జి ఎఫ్ఆర్ఓ కమాలుద్దీన్

సాక్షి, సిటీబ్యూరో/కడ్తాల్: ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన ప్రభుత్వాధికారే ఓ స్థానిక వ్యాపారితో కుమ్మక్కై ధ్వంసం చేయడమే కాకుండా అమ్మేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈమేరకు కడ్తాల్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసి, ప్రధాన నిందితుడి కోసం గాలిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. మైసిగండి గ్రామానికి చెందిన గజరాత్ జైన్, అటవీ శాఖల మధ్య భూ యాజమాన్యం వివాదంపై 2006లో హైకోర్టు స్టే ఇచ్చింది. దీంతో ఆ స్థలంలో ఉన్న స్టోన్ క్రషింగ్ యూనిట్ కార్యకలాపాలు నిలిచిపోయాయి. స్థలంతో పాటు క్రషర్ యూనిట్‌ను పరిరక్షించాలని ఆటవీ శాఖను న్యాయస్థానం ఆదేశించింది.

- ప్రస్తుతం అటవీశాఖ ఆధీనంలో ఉన్న స్టోన్ క్రషర్ యూనిట్‌పై ఆమనగల్లు డివిజన్ ఇన్‌చార్జి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ఆర్ఓ) ఘాజీ కమాలుద్దీన్ కన్నేశాడు. కొల్లాపూర్‌కు చెందిన కుర్మయ్యతో కలిసి క్రషర్ యూనిట్‌ను తుక్కు కింద విక్రయించాలని పథకం వేశారు. ఈ మేరకు కుర్మయ్య, ఇద్దరు సహచరులు లక్ష్మణ్, దేవులతో కలిసి గ్యాస్ కట్టర్ల సాయంతో స్టోన్ క్రషర్‌లోని యంత్ర భాగాలను కత్తిరించారు.
- జేసీబీ సాయంతో తుక్కును లారీలో లోడింగ్ చేసి రోజుకు కొంత భాగం చొప్పున నెల రోజుల్లో కొత్తూరులోని ఓ ఐరన్ కంపెనీకి తరలించారు. కిలో రూ.34 చొప్పున రూ.24 లక్షల విలువైన క్రషర్ యంత్రాలను విక్రయించారు. వచ్చిన సొమ్ములో కుర్మయ్య రూ.7.5 లక్షల నగదు, మరో రూ.50 వేలు ఆన్‌లైన్ ద్వారా కమాలుద్దీన్‌కు బదిలీ చేశాడు.
- విషయం తెలుసుకున్న గజరాత్ జైన్‌కు చెందిన స్టోన్ క్రషర్ యూనిట్ యంత్రాలను దొంగిలించారని కడ్తాల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో నిందితులపై ఐపీసీ సెక్షన్ల కింద కేసులతో పాటు పబ్లిక్ ప్రాపర్టీయాక్ట్–1984 కింద కేసులు నమోదు చేశారు. కాల్ డేటా, సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా కుర్మయ్య, లక్ష్మణ్, దేవులను పోలీసులు అరెస్టు చేసి, జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. వీరి నుంచి రూ.13 లక్షల నగదుతో పాటు లారీ, జేసీబీ, కారును స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న ఎఫ్ఆర్ఓ కమాలుద్దీన్ కోసం గాలిస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డి

ఆమనగల్లు: విద్యారంగంతో పాటు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమిస్తామని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) ఎమ్మెల్సీ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణంలో బుధవారం పర్యటించిన ఆయన ఆయా పాఠశాలల ఉపాధ్యాయులను కలిసి ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యారంగంపై ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందని విమర్శించారు. తనను ఆదరించి గెలిపించాలని, సమస్యలపై పోరాడతానని హామీ ఇచ్చారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మంతరావు మాట్లాడుతూ.. విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఏవీఎన్ రెడ్డికి మద్దతివ్వాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కాశీరావ్, ప్రధాన కార్యదర్శి పూజారి రమేశ్, రాష్ట్ర నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, యుగంధర్ రెడ్డి, గంగాధర్, మోహన్‌కుమార్, మహేశ్, నర్సింహారెడ్డి, నర్సింహ, వినోద్, బాల్‌రెడ్డి, శంకర్, పాండు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డి

విద్యార్థులకు పుస్తకపఠనం తప్పనిసరి

ఆమనగల్లు: విద్యార్థులు ప్రగతిపథంలో నడవాలంటే పుస్తకపఠనం తప్పనిసరని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణంలో రూ.కోటితో నిర్మించిన మోడల్ గ్రంథాలయ భవనాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శంషాబాద్, మంచాల, కొత్తూరు, షాబాద్‌లలో రూ.6 కోట్లతో నూతన భవనాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఆమనగల్లు, షాద్‌నగర్‌లో నిర్మిస్తున్న భవనాలు తుదిదశకు చేరుకున్నాయని, మార్చి చివరి నాటికి ప్రారంభించేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ప్రస్తుతం పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ అభ్యర్థుల కోసం రూ.10 లక్షల వ్యయంతో వివిధ పుస్తకాలను అందుబాటులోకి తెచ్చామన్నారు. ఇటీవల తుక్కుగూడ, మంఖాల్, ఎక్వాయిపల్లి, కందుకూరు, మాదాపూర్‌లో పౌరపఠన మందిరాలను ప్రారంభించినట్లు ఆయన గుర్తు చేశారు. పాఠకుల అభిరుచికి అనుగుణంగా గ్రంథాలయాలను తీర్చి దిద్దుతున్నామన్నారు. 1,500 జనాభా కలిగిన ప్రతి గ్రామంలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని, మండల కేంద్రాల్లో డిజిటల్ గ్రంథాలయ సేవలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి మనోజ్‌కుమార్, ఈఈ కుమార్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్, లైబ్రేరియన్ సత్యనారాయణ, కమటం రాధమ్మ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లులో మోడల్ గ్రంథాలయ భవనాన్ని పరిశీలిస్తున్న సత్తు వెంకటరమణారెడ్డి తదితరులు

రైతు రుణ విమోచన చట్టాలు తేవాలి

- రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి సాగర్

ఇబ్రహీంపట్నం రూరల్: దేశవ్యాప్తంగా రైతు రుణ విమోచన చట్టాలను తెచ్చి, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి టి.సాగర్ డిమాండ్ చేశారు. రైతు సంఘం ఇబ్రహీంపట్నం మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం వైష్ణవి గార్డెన్‌లో రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ.. కేంద్రం తెచ్చిన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఏడాదిపాటు నిర్విరామంగా నిర్వహించిన పోరాటాల్లో 750 మంది రైతులు చనిపోయారని గుర్తు చేశారు. చివరికి మోదీ ప్రభుత్వం దిగిరాక తప్పలేదని, ఇది రైతుల పోరాట విజయమన్నారు. దేశానికి అన్నం పెట్టే అన్నదాతను ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలం అయ్యాయన్నారు. ఏడాదికి 15 వేల మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం తెచ్చిన కమిటీల్లో రైతులు, రైతు సంఘం సభ్యులను చేర్చుకోవాల్సి ఉన్నప్పటికీ ఏకపక్షంగా వ్యవహరించిందని ఆయన విమర్శించారు. దీన్ని దేశ వ్యాప్తంగా ఉన్న 500 సంఘాలు అంగీకరించడం లేదని స్పష్టం చేశారు. రైతుల అప్పులు మాఫీ చేయలేని కేంద్రం అదానీ, అంబానీలకు సంబంధించిన రూ.లక్షల కోట్లు మాఫీ చేసిందని ఆరోపించారు. మరోవైపు రైతులు, సంఘాలతో మాట్లాడకుండా విద్యుత్ సవరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశ పెట్టిందన్నారు. ఇది చాలా ప్రమాదరకమని, ఈ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తుల్లో జరిగే పోరాటాలకు రైతులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం జాతీయ నాయకుడు పి.జంగారెడ్డి మాట్లాడుతూ.. రైతుల సమస్యల పరిష్కారంలో కేంద్రం వైఖరికి నిరసనగా ఈనెల 26న జిల్లా కేంద్రాల్లో ట్రాక్టర్లతో ర్యాలీలు చేపట్టాలని కోరారు. అంతకు ముందు వ్యవసాయ శాఖ ఏవో వరప్రసాద్ రెడ్డి, పశు వైద్యాధికారి సురేందర్ రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆర్.జంగయ్య, మండల అధ్యక్ష, కార్యదర్శులు ముసలయ్య, రామకృష్ణారెడ్డి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సాగర్

డీజిల్ దొంగల ముఠా అరెస్టు

- డీసీఎం వ్యాన్, రూ. 45 వేలు రికవరీ
- వివరాలు వెల్లడించిన ఏసీపీ కుశాల్కర్



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ కుశాల్కర్

కొత్తూరు: జాతీయ రహదారిపై రోడ్డు పక్కన నిలిపిన వాహనాల్లో నుంచి డీజిల్ దొంగిలిస్తున్న ముఠాను కొత్తూరు పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం షాద్‌నగర్ ఏసీపీ కుశాల్కర్ ఈ కేసుకు సంబంధించిన వివరాలు విలేకరులకు వెల్లడించారు. గుజరాత్ నుంచి చెన్నైకు ప్లాస్టిక్ ముడిసరుకుతో వెళ్తున్న రెండు లారీలను ఈ నెల 11న తెల్లవారుజామున కొత్తూరు సమీపంలో రోడ్డు పక్కన నిలిపిన డ్రైవర్లు నిద్రకు ఉపక్రమించారు. ఈ క్రమంలో లారీల వెనకాల శబ్దం రావడంతో మేల్కొని గమనించగా.. అప్పటికే కొందరు దుండగులు లారీల ట్యాంకులను ధ్వంసం చేసి డీజిల్‌ను చోరీ చేసి డీసీఎం వ్యాన్‌లో పారిపోయారు. ఈ విషయమై వారు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఈ నెల 17న రాత్రి కొత్తూరు పారిశ్రామికవాడ వద్ద పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా.. చేతిలో గడ్డపార, డీసీఎం వ్యాన్‌లో అనుమానాస్పదంగా ఉన్న మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సబీబ్‌ఖాన్(42), ముబారక్‌ఖాన్(38), బీరంసింగ్ వర్మ(38)లను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించారు. దీంతో వారు డీజిల్ చోరీ చేస్తున్న విషయాన్ని అంగీకరించారు. వీరు చోరీ చేసిన డీజిల్‌ను కొనడంతో పాటు వారికి పలు విధాలుగా సహకరిస్తున్న శంషాబాద్ ప్రాంతానికి చెందిన ఎండీ అన్వర్(40)ను సైతం అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వీరి నుంచి రూ.45 వేల నగదు, డీసీఎం వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా ఈ నలుగురు 12 ఏళ్ల నుంచి ఈ విధమైన చోరీలకు పాల్పడి, జైలుకు సైతం వెళ్లినట్లు గుర్తించారు. కొత్తూరు సీఐ బాలరాజు ఆధ్వర్యంలో కేసును ఛేదించిన ఏఎస్‌ఐ అబ్దుల్లా, సిబ్బంది నరేందర్, లింగుస్వామి, మహిపాల్, హరీశ్, రవీందర్‌నాయక్‌లను ఏసీపీ అభినందించారు.

కెనడియన్ వుడ్ హోమ్స్ అద్భుతం

- కెనడా అటవీ శాఖ సహాయ మంత్రి రిచార్డ్ మాన్నింగ్
- ఆదిబట్లలో ఆ దేశ బృందం పర్యటన



ఆదిబట్లలోని నెస్కా హోమ్స్ వద్ద కెనడా మంత్రిత్వ శాఖ ప్రతినిధులు

ఇబ్రహీంపట్నం రూరల్: కెనడియన్ వుడ్‌తో నెస్కా సంస్థ నిర్మించిన ఇళ్లు అద్భుతంగా ఉన్నాయని కెనడా అటవీశాఖ సహాయ మంత్రి రిచార్డ్ మాన్నింగ్ పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్‌లో కెనడా మంత్రిత్వ శాఖ బృందం పర్యటించింది. ఆదిబట్లలోని నెస్కా హోమ్స్ పరిశ్రమను వారు పరిశీలించారు. అనంతరం టీసీఎస్ సమీపంలో కెనడియన్ వుడ్‌తో నిర్మించిన హాట్ స్పాట్ గృహాన్ని పరిశీలించారు. నెస్కా చైర్మన్ పీఎల్ నారాయణ కెనడియన్ వుడ్‌తో నిర్మించిన ఇళ్ల గురించి కెనడా బృందానికి వివరించారు. రాబోయే రోజుల్లో దేశ వ్యాప్తంగా 10వేల కెనడియన్ వుడ్ ఇళ్లను నిర్మించేందుకు తమ సంస్థ కృషి చేస్తోందని తెలిపారు. భారతీయ మార్కెట్, రియల్ ఎస్టేట్ గురించి అవగాహన కల్పించారు. నెస్కా హోమ్స్ ఆర్కిటెక్చర్, వుడెన్ కన్‌స్ట్రక్షన్, ప్రీమియం ఆర్కిటెక్చర్, వుడెన్ హోమ్ కన్‌స్ట్రక్షన్‌లో సింగిల్ విండో సొల్యూషన్ ప్రొవైడర్‌తో భారతదేశ వుడ్ ఫ్రేమ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీగా నిలిచిందని తెలిపారు. అనంతరం ఆ దేశ ప్రతినిధులకు చార్మినార్ ప్రతిమను అందజేశారు. కార్యక్రమంలో ఫారెస్ట్రీ ఇన్నోవేషన్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రెసిడెంట్ మైకెల్ లోసెత్, ఇంటర్నేషనల్ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ జిమ్‌మెసర్, అంతర్జాతీయ వ్యాపార వ్యవహారాల డైరెక్టర్ పిర్రె జాన్‌ధన్ తీస్‌డాలే, కెనడా వుడ్ గ్రూప్ ప్రెసిడెంట్ బ్రూసీ సెయింట్ జాన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోర్‌డాన్ ముర్రే, మార్కెటింగ్ జనరల్ మేనేజర్ జాన్ లాన్‌గ్లే, దావే సున్‌దీర్, కమల్ సంగేరా, నెస్కా డైరెక్టర్లు చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదం

చుక్కాపూర్ వాసి మృతి

తలకొండపల్లి: తలకొండపల్లి మండల పరిధిలోని చుక్కాపూర్‌కు చెందిన ఓ వ్యక్తి హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గ్రామానికి చెందిన దొడ్డి నర్సింహ (46) బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వలస వెళ్లాడు. హబ్సిగూడ ప్రాంతంలో ప్రైవేట్‌గా పనిచేస్తూ భార్యాపిల్లలతో నివాసముంటున్నాడు. మంగళవారం సాయంత్రం రోడ్డు ప్రమాదంలో నర్సింహ గాయపడ్డాడు. మెరుగైన చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారు జామున కన్నుమూశాడు. నర్సింహ మృతితో చుక్కాపూర్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

యువకుడి అదృశ్యం



సురేశ్ (ఫైల్)

చేవెళ్ల: ఉద్యోగానికి వెళుతున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ అబ్దుల్ హయ్యూమ్ కథనం ప్రకారం.. షాబాద్ మండలం రేగడిదోసడ గ్రామానికి చెందిన బైండ్ల జంగయ్య కుమారుడు సురేశ్(22) చేవెళ్ల మండల కేంద్రంలోని మెడ్‌ల్యాబ్‌లో కొంతకాలంగా పనిచేస్తున్నాడు. రోజు ఇంటి నుంచి వచ్చి వెళ్లేవాడు. ఎప్పటి మాదిరిగానే మంగళవారం ఉదయం 7 గంటలకు ఇంటి నుంచి జాబ్‌కు వెళ్తున్నట్లు చెప్పి వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి తిరిగి రాలేదు. అతని ఆచూకీ కోసం ఎంత వెతికినా ఫలితం దక్కలేదు. దీంతో అతని తల్లిదండ్రులు చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జల్‌పల్లిలో..



మల్లేశ్ (ఫైల్)

పహాడీషరీఫ్: ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన పహాడీ షరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై మధుసూదన్ కథనం ప్రకారం...జల్‌పల్లి శ్రీరాం కాలనీకి చెందిన మైసయ్య కుమారుడు వల్లపు మల్లేశ్ (23) డ్రైవర్. ఈ నెల 17న సాయంత్రం తన గుర్తింపు కార్డులు, ఇంటి డాక్యుమెంట్లు, కొంత నగదు తీసుకొని ఇంట్లో చెప్పకుండా బయటికి వెళ్లిపోయాడు. తిరిగి ఎంతకూ రాకపోవడంతో అతని సోదరుడు అనిల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇతని ఆచూకీ తెలిసిన వారు పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో గానీ 94906 17241 నంబర్‌లో గాని సమాచారం అందించాలని పోలీసులు కోరుతున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



చిందర వందరగా అల్మారాలోని సామగ్రి

పహాడీషరీఫ్: తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి వెలుగుజూసింది. ఎస్సై మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం ..వాదే ముస్తఫా బస్తీకి చెందిన మహ్మద్ యూసుఫ్ మంగళవారం ఉదయం ఇంటికి తాళం వేసి డ్యూటీకి వెళ్లాడు. రాత్రి వచ్చి చూడగా.. తాళం పగులకొట్టి ఉండటంతో పాటు అల్మారా తెరిచి ఉన్నట్లు కనిపించింది. పరిశీలించగా అందులో దాచిన తులం బంగారు ఆభరణాలు, 12 తులాల వెండి, రూ.20 వేల నగదు కనిపించలేదు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అడ్వాన్స్ చెల్లింపు గడువు పెంపు

సాక్షి, సిటీబ్యూరో: రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ బండ్లగూడ, పోచారంలలో నిర్మించిన ఫ్లాట్స్‌ను సొంతం చేసుకునేందుకు వినియోగదారులు టోకెన్ అడ్వాన్స్ చెల్లించే గడువును హెచ్‌ఎండీఏ పొడిగించింది. ఫిబ్రవరి 15 వరకు అడ్వాన్స్ డిమాండ్ డ్రాఫ్టులను మేనేజింగ్ డైరెక్టర్, తెలంగాణ రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ లిమిటెడ్, ఉర్దూగల్లీ, స్ట్రీట్‌నెం.17, హిమాయత్‌నగర్ హైదరాబాద్‌కు చేరేలా పంపించాలని సూచించింది. అనంతరం ఫ్లాట్స్ కేటాయింపునకు సంబంధించి లాటరీని పారదర్శక విధానంలో నిర్వహిస్తామని తెలిపింది. ప్రస్తుతం పోచారంలో 3 బీహెచ్‌కె ఫ్లాట్స్ 16, 2బీహెచ్‌కే ఫ్లాట్స్ 570, 1 బీహెచ్‌కె ఫ్లాట్స్ 269 ఉన్నాయని తెలిపింది. ఇక బండ్లగూడలో 1బీహెచ్‌కే ఫ్లాట్స్ 344, సీనియర్ సిటీజన్లకు 1 బీహెచ్‌కే ఫ్లాట్స్ 43 ఖాళీగా ఉన్నాయని ప్రకటించింది. 3 బీహెచ్‌కే ఫ్లాట్స్‌కు రూ.3 లక్షలు, 2 బీహెచ్‌కే ఫ్లాట్స్‌కు రూ.2 లక్షలు, 1 బీహెచ్‌కే ఫ్లాట్‌కు రూ.లక్ష చొప్పున టోకెన్ అడ్వాన్స్‌గా చెల్లించాలని కోరింది.

భూముల వేలానికి అనూహ్య స్పందన

సాక్షి, సిటీబ్యూరో: నగర శివార్లలో హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన భూముల వేలానికి అనూహ్య స్పందన లభించింది. పలు ల్యాండ్ పార్సెల్స్ హాట్‌కేకుల్లా అమ్ముడయ్యాయి. మహానగరాభివృద్ధి సంస్థ ఖజానాపై కాసుల వర్షం కురిసింది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎంఎస్‌టీసీ బుధవారం నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల పరిధిలోని 9 ల్యాండ్ పార్సెల్ (ఆన్‌లైన్ ఈ -ఆక్షన్) ద్వారా విక్రయించగా.. రూ.195.24 కోట్ల రెవెన్యూ లభించడం విశేషం. పలువురు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, సంస్థలు ల్యాండ్ పార్సెల్స్ కొనుగోలుకు ఆసక్తి కనబరచడంతో అత్యధికంగా గజం రూ.1.11 లక్షల ధర పలకడం విశేషం. రెండో దశ ల్యాండ్ పార్సిల్స్ అమ్మకాలకు మరో మూడు రోజుల తర్వాత నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు హెచ్‌ఎండీఏ ఒక ప్రకటనలో తెలిపింది.

గ్రంథాలయాల ఆధునికీకరణకు చర్యలు



గ్రంథాలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి తదితరులు

శంషాబాద్: గ్రంథాలయాలను ఆధునికీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి అన్నారు. జిల్లా వ్యాప్తంగా రూ. 9 కోట్లతో గ్రంథాలయ భవనాల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. బుధవారం ఆయన శంషాబాద్ పట్టణంలో రూ. కోటి నిధులతో చేపట్టిన గ్రంథాలయ భవన నిర్మాణపనులను మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మతో కలిసి పరిశీలించారు. పనులు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. మరో రూ. 20 లక్షలు అదనపు నిధులు విడుదల చేయనున్నట్లు తెలిపారు. పోటీ పరీక్షలకు అవసరమైన స్టడీమెటీరియల్ అన్ని గ్రంథాలయాల్లో అందుబాటులో ఉందన్నారు. అభ్యర్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆర్. రేఖ, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



రవి మృతదేహం

మొయినాబాద్: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ లింగానాయక్ కథనం మేరకు.. మండలంలోని పెద్ద మంగళారం గ్రామానికి చెందిన ఊశన్నగారి రవి(45) కూరగాయల వ్యాపారి. మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. స్నేహితులతో కలిసి చందానగర్ గ్రామానికి వెళ్లారు. అక్కడ మద్యం సేవించి పేకాట ఆడారు. సాయంత్రం ఎవరి ఇంటికి వారు వెళ్లిపోయారు. రాత్రి 9 గంటలైనా రవి ఇంటికి రాకపోవడంతో అతని భార్య మంజుల ఫోన్ చేసింది. తాను గ్రామంలోని కల్లుదుకాణం వద్ద ఉన్నానని ఇంటికి వస్తానని చెప్పాడు. దీంతో కుటుంబసభ్యులు భోజనం చేసి పడుకున్నారు. ఉదయం వరకు కూడా రవి ఇంటికి రాలేదు. దీంతో మంజుల రవి స్నేహితుడికి ఫోన్ చేసింది. రాత్రి తమతో ఉన్నాడని, ఎవరి ఇంటి వారు వెళ్లామని చెప్పాడు. రాత్రి మీరు ఉన్న ప్రాంతాన్ని చూపాలని మంజుల రవి స్నేహితుడిని కోరింది. వారు మద్యం తాగిన స్థలం వద్దకు వెళ్లారు. అక్కడ రవి విగతజీవిగా కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. రవితో కలిసి మద్యం సేవించిన స్నేహితులను విచారిస్తున్నట్లు తెలిసింది.

ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు విద్యార్థులు



ఐఐఎస్ఎఫ్ ఫెస్టివల్‌కు బయలుదేరిన విద్యార్థులు

మాడ్గుల: మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లోని మౌలానా అబ్దుల్ కలాం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఏఎన్ఐటీ)లో ఈ నెల 21నుంచి 24వ తేదీ వరకు జరిగే ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్(ఐఐఎస్ఎఫ్) -2022కు ఇర్విన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ ఫెస్టివల్ సందర్భంగా స్టూడెంట్ సైన్స్ విలేజ్‌లో జరగబోయే వివిధ ప్రదర్శనలను పరిశీలించడానికి ఇర్విన్ ఉన్నత పాఠశాలకు విద్యార్థులు కే వైష్ణవి, ఆర్ చరణ్‌తేజ, శ్రోహిత్‌కుమార్, జునైద్, జశ్వంత్‌లు బుధవారం పాఠశాల నుంచి బయలుదేరి వెళ్లారు. విద్యార్థులను సర్పంచ్ పుష్పలత, ఎంపీటీసీలు కొప్పుల తిరుపతమ్మ, ఎస్ఎంసీ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్, హెచ్ఎం విజయభాస్కర్‌రెడ్డి అభినందించి వీడ్కోలు పలికారు.

హత్యాయత్నం కేసులో పదేళ్ల జైలు

రూ. 2వేలు జరిమానా



కైజర్ అలీ ఖాన్, నిందితుడు

పహాడీషరీఫ్: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన లారీ డ్రైవర్ హత్యాయత్నం కేసులో రంగారెడ్డి జిల్లా 8వ అదనపు జిల్లా కమ్ సెషన్స్ కోర్టు నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష, రూ. 2వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. నల్గొండ జిల్లా రామన్నపేట మండలం ఎల్లంకి గ్రామానికి చెందిన సత్తయ్య కుమారుడు మల్లేశ్ లారీ డ్రైవర్. 2015 జనవరి 31న తండ్రీకొడుకులు వైజాగ్ నుంచి స్క్రాప్ లోడ్‌తో హైదరాబాద్‌కు వస్తున్నారు. ఈ క్రమంలో అనకాపల్లి పెట్రోల్ పంప్‌లో డీజిల్ కొట్టించేందుకు లారీని నిలిపారు. ఆ సమయంలో వనస్థలిపురానికి చెందిన మహ్మద్ కైజర్ అలీఖాన్(27) లారీ అపహరించాలనే పథకం వేశాడు. ఇందులో భాగంగా లిఫ్ట్ అడిగి లారీ ఎక్కాడు. నార్కట్‌పల్లి వద్దకు రాగానే వాహనాన్ని ఆపి మూడు బాదం మిల్క్ బాటిల్ తీసుకుని నిద్ర మాత్రలు కలిపి మల్లేశ్‌కు ఇచ్చాడు. మల్లేశ్ నిద్రలోకి జారుకోగానే కైజర్ లారీ నడుపుకుంటూ వచ్చాడు. పెద్ద అంబర్‌పేట వద్దకు రాగానే టైర్ పంక్చర్ అయినట్లుంది.. చూడాలంటూ సత్తయ్యను కిందికి దించి లారీతో పరారయ్యాడు. తుక్కుగూడ సమీపంలోకి రాగానే మెలకువ వచ్చిన మల్లేశ్ తన తండ్రి విషయమై ఆరా తీశాడు. గొడవ జరుగుతుందని గ్రహించిన కైజర్ వెంటనే పక్కనే ఉన్న స్పానర్‌తో మల్లేశ్ తలపై మోది లారీ లోనుంచి నెట్టేశాడు. తీవ్ర గాయాలపాలైన మల్లేష్ ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న అప్పటి డీఐ కె.మధుసూదన్ రెడ్డి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన రంగారెడ్డి జిల్లా 8వ అదనపు జిల్లా కమ్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి సుగలి నారాయణ బుధవారం నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

సీనియారిటీ ఆధారంగా పదోన్నతులు కల్పించాలి

శంషాబాద్: కామన్ సీనియారిటీ ప్రకారం టీచర్లకు పదోన్నతులు కల్పించాలని టీజీపీఈటీఏ సంఘం నాయకులు అన్నారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో 110 ద్వారా మంజూరైన 1849 అప్‌గ్రేడెషన్ పోస్టులను కామన్ సీనియారిటీ ప్రకారం కేటాయించాలన్నారు. కార్యక్రజుమంలో టీజీపీఈటీల రాష్ట్ర అధ్యక్షుడు విజయ్, ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, కోశాధికారి నాగరాజు గౌడ్ పాల్గొన్నారు.

కేసీఆర్, కేటీఆర్‌పై కేసు నమోదు చేయండి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, కార్పొరేటర్ల డిమాండ్
- సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసీఆర్, కేటీఆర్‌లపై ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

హుడాకాంప్లెక్స్: ప్రధాన మంత్రి మోడీ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలపై అభ్యంతరకరమైన భాషని వాడుతున్న సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లపై కేసులు నమోదు చేయాలని బీజేపీ కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ నాయకులపై మాట్లాడే భాషపై అభ్యంతరం తెలుపుతూ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. తమపై అసభ్య పదజాలంతో దూషిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, మంత్రులపై తెలంగాణ పోలీసులు ఇప్పుడైనా కేసులు నమోదు చేస్తారని ఆశిస్తున్నామని అన్నారు. జఫ్ఫా, బఫూన్, డఫ్ఫర్ లాంటి ఎన్నో పదాలు కేసీఆర్, కేటీఆర్ సొంత మాటలని, వాటిని ఆదర్శంగా తీసుకుని నేను వాడితే నాపైన మాత్రం కేసులు పెడుతున్నారని కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి ఆవేదన వ్యక్తం చేశారు. అదే కేసీఆర్, కేటీఆర్‌లు మాట్లాడినప్పుడు పోలీసులకు ఫిర్యాదు చేస్తే కేసులు ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు. ప్రశ్నించే గొంతులపైన అక్రమ కేసులు పెట్టి అణగదొక్కాలని చూస్తే బీఆర్ఎస్ పార్టీని గద్దె దించే వరకు బీజేపీ కార్యకర్తలు రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తారని తెలిపారు. చంపాపేట కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ఏ నాయకుడైనా ప్రజలకు స్ఫూర్తినిచ్చే విధంగా మాట్లాడాలని, కించపరిచే విధంగా మాట్లాడితే సహించేది లేదన్నారు. సరూర్‌నగర్ కార్పొరేటర్ శ్రీవాణిపై అక్రమ కేసులు నమోదు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కార్పొరేటర్లను లక్ష్యంగా చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, వంగా మధుసూదన్‌రెడ్డి, ముషీరాబాద్ కార్పొరేటర్ రవిచారి, మహేందర్, శ్రవణ్, సరళ, అమృత, మహాలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.